యూనిట్ III

# 8. ఎవరతను?

## చదవండి-ఆలోచించండి-మాట్లాడండి



ఎగురవే వినువీథి - ఎగురవే జండా
శాంతి దూతగ నేడు - జాతీయ జండా
యుగ యుగంబుల జగతి నెగురవే జండా
సౌఖ్య ప్రదాతగా స్వాతంత్ర్య జండా॥

భారతీయుల మహా పోరాట ఫలితమా
వీరయోధుల రక్త ధారలకు చిహ్నామా
శాంతి మాత అశోక ధర్మ చక్రము దాల్చి
శాంతి నిల స్థాపించ నరుదెంచితివి నీవు॥

**ప్రశ్నలు:**

1. పై చిత్రం చూస్తే నీకేమనిపిస్తున్నది?
2. పై గేయం దేన్ని తెలియజేస్తున్నది?
3. జండాను దేనికి చిహ్నామని కవి చెప్పాడు?
4. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్ళ గురించి చెప్పండి.


**ఉద్దేశం:** "సర్దార్" బిరుదాంకితుడైన వల్లభబాయి పటేల్ జీవితంలో చూపిన ధైర్యసాహసాలను పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



అది చలికాలం కాదు. కాని కమ్మరి చేతులు వణుకుతున్నాయి. 'చూస్తూ చూస్తూ ఎలా కాల్చేది? మనసొప్పటం లేదు. పోనీ కళ్ళు మూసుకొని కాల్చేస్తే అమ్మో! ఇంకేమైనా ఉందా? ఏదైనా పొరపాటు జరిగితే? ఇలా ఆలోచిస్తూ కమ్మరి వెనుకడుగు వేస్తున్నాడు.



కమ్మరి ఆందోళనను చూస్తున్న బాలుడు చకచకా రెండడుగులు ముందుకు వేసి కమ్మరి చేతిలోని ఎర్రగా కాలిన ఇనుపచువ్వను చేతిలోకి తీసుకున్నాడు. ఆలస్యం చేయకుండా తన కంటికిపైన ఉన్న గడ్డపై (కణితిపై) పెట్టుకున్నాడు. అంతే అక్కడున్న వారంతా పిల్లవాడు చేసిన పనికి బిగుసుకపోయారు.

కడ్డీని పక్కన పడేసి నాన్నా! ఇక నా గడ్డ తగ్గిపోయినట్టే కదా! అని తండ్రిని అడిగాడు బాలుడు. ఆశ్చర్యం నుంచి తేరుకున్న తండ్రి 'ఓ! ఇక నీకే సమస్యాలేదు' అంటూ బాలుణ్ణి దగ్గరికి తీసుకుని ముద్దాడాడు.

ఇదంతా ఎందుకంటే, ఆనాటి కాలంలో గడ్డలను తగ్గించాలంటే ఇప్పటిలా సరయిన వైద్య సదుపాయాలు ఉండేవికావు. ఎర్రగా కాలిన ఇనపచువ్వతో కాల్చడమే దానికి మార్గం.

ఇంతటి ధైర్యం చూపిన ఆ సాహసబాలుడే తరువాత పేరుపొందిన స్వాతంత్ర్య సమరయోధుడయ్యాడు. ఆంగ్లేయులను ముప్పుతిప్పలు పెట్టాడు. స్వాతంత్ర్యం వచ్చాక మొట్టమొదటి హోమ్ శాఖామంత్రి అయ్యాడు. గాంధీ, నెహ్రూల తరవాత అంతటి గౌరవాన్ని సంపాదించాడు.

చిన్నప్పుడు పొలంపనుల్లో తండ్రికి సహాయం చేస్తూ, బడికి వెళ్ళి పాఠాలు చదువుకునేవాడు. న్యాయవాది కావాలని కలలు కనేవాడు. అందుకోసం పట్టుదలతో కృషిచేసి ఇంగ్లాండుకెళ్ళి ఆ కోర్సు చదివి వచ్చాడు. న్యాయవాది ఉద్యోగం



సంపాదించి నైపుణ్యంగల న్యాయవాదని పేరు తెచ్చుకున్నాడు. సంపాదనలో ఎక్కువగా దానధర్మాలకే ఖర్చు చేసేవాడు. కష్టాల్లో ఉన్నవాళ్ళ మీద జాలి చూపేవాడు. తన కోసం ఇతరులను బాధపెట్టేవాడు కాదు.

ఒకసారి ఏం జరిగిందంటే, ఆ న్యాయవాది, కోర్టులో ఓ కేసును వాదిస్తూ ఉన్నాడు. మీకు ఏదో టెలిగ్రామ్ వచ్చింది, అంటూ ఒకతను ఏదో పత్రం తెచ్చి ఇచ్చాడు. ఆయన దాన్ని చదువుకొని మడిచి కోటు జేబులో పెట్టుకున్నాడు. కోర్టులో వాదప్రతివాదాలు పూర్తి అయ్యాక విరామసమయంలో, ఏమిటండీ! మీకేదో టెలిగ్రామ్ వచ్చినట్టుందే! ఏమిటి సంగతి అని అడిగారు స్నేహితులు. ఆస్పత్రిలో ఉన్న నా భార్య చనిపోయింది అని గుండెల్లో దాచుకున్న విషాదాన్ని బయటపెట్టాడు. తన కష్టం వల్ల ఇతరులకు నష్టం కలగకూడదన్నది ఆయన భావన.

ఇంతకీ ఇంతటి సాహసచరిత్ర గల ధైర్యశాలి ఎవరో తెలుసా? భారతదేశపు ఉక్కుమనిషి (ఐరన్ మాన్ ఆఫ్ ఇండియా) అని పిలుస్తూంటాం ఆయన్ను.

ఆయనే సర్దార్ వల్లభ భాయి పటేల్. మనం గర్వించదగిన దేశనాయకుల్లో ఆయన ఒకరు.

1921 సంవత్సరం సహాయ నిరాకరణోద్యమం జరుగుతున్న కాలం. ప్రతీ రాష్ట్రానికి ఒక నాయకుడు - ప్రజలను చైతన్యపరచడానికి పూనుకున్నాడు. గుజరాత్ రాష్ట్ర బాధ్యత పటేలు తీసుకున్నాడు. ఇతడు ఏపని చేసినా తదేక దీక్షతో చేసేవాడు. అందుకే తన న్యాయవాద వృత్తిని వదులుకొని, రాత్రనక పగలనక శరీరకష్టాన్ని లెక్కచేయక పల్లె పల్లెకూ తిరిగాడు. స్వతంత్రదేశపు సౌఖ్యాలను అందరికీ బోధించాడు. విద్యాధికులలో పరసంస్కృతి వ్యామోహాలు పలచబారేటట్లు చేశాడు. స్వదేశీయ వస్తువులపట్ల అభిలాష పెంపొందించాడు. విదేశవస్తువులు వాడకం మానిపించాడు. ప్రజలలో పరస్పర సోదర భావం పెంపొందింపజేశాడు. బ్రిటీషువారికి ఇతడు కొరకరాని కొయ్యగా మారాడు. జాతీయ పతాకం చేతపట్టి, ఖద్దరు టోపీ పెట్టుకొని జనం వీథులలో తిరిగేటట్లుగా అందరికీ ప్రేరణ కలిగించాడు. "వందేమాతరం, పటేలుకు జై' అన్న నినాదాలు మిన్నంటాయి.

నాగపూరులో సత్యాగ్రహం జరుగుతున్నప్పుడు పటేలు గుజరాత్ రాష్ట్రం నుంచి స్వచ్ఛంద సేవకులను లెక్కకు మీరి పంపేవాడు. అక్కడి మహానాయకులను ప్రభుత్వం బంధించింది. "బోర్సద్" నగరంలోని ప్రజలమీద ప్రభుత్వం రెండు లక్షల సమిష్టి అపరాధాన్ని విధించగా పటేలు అందులోని యదార్థాన్ని విచారించి ప్రజలు నిరపరాధులని తెలుసుకొన్నాడు. "మనం తప్పుచేయనప్పుడు భయపడవలసిన పనిలేదు. అపరాధరుసుము చెల్లించనవసరం లేదు," అని హెచ్చరించాడు. ఎంత తలకిందులైన ఒక్కరి నుంచీ ఒక్క పైసా కూడా ప్రభుత్వం వసూలు చేయలేకపోయింది.

1928వ సంవత్సరంలో బార్డోలీ మండలానికి కరువు వచ్చింది. రైతులందరు తమకు తిండిగింజలు, పశువులకు గడ్డి లేక అలమటించారు. సర్కారుకు చెల్లించవలసిన భూమిశిస్తు మాఫీ చేయమన్నారు. లేదా ఆపుచేయండని విన్నపాలుచేశారు. బ్రిటీషువారు ఆ మాటలు పట్టించుకోకపోగా నూటికి ఇరవై రెండు వంతులు ఎక్కువ చేశారు. పటేలు నాయకత్వంలో రైతులందరూ సమావేశమయ్యారు. సత్యాగ్రహానికి సిద్ధంకమ్మని పటేలు పిలుపునిచ్చాడు. ప్రభుత్వంవారు ఒక మెట్టు దిగక తప్పలేదు. పెంచిన పన్నులు తీసివేశారు. జప్తుచేసిన సొత్తులను వాపసు చేశారు. శిక్షించినవారిని విడిచిపెట్టారు. సత్యాగ్రహ సమరంలో సంపూర్ణ విజయాన్ని సాధించినందుకు పటేలును ప్రజలు సర్దార్ బిరుదమిచ్చి గౌరవించారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరవాత పటేలును ఉపప్రధానిగా ఎంపికచేయడం జరిగింది. దేశంలో శాంతిభద్రతలు శాశ్వతంగా నెలకొలపటం మీద ఆయన దృష్టిపెట్టారు. దేశవిభజన ఫలితంగా మతకల్లోలాలు చెలరేగాయి. వాటితో రక్తపాతం కూడా జరిగింది. వాటిని అణచటంలో పటేలు అసమాన్యమయిన దక్షత చూపించాడు. పాకిస్తాన్‌నుంచి శరణార్థులు విరివిగా మనదేశానికి వస్తున్నారు. వల్లభభాయి పటేలు వారందరికీ నివాసాలు కల్పించాడు.



బ్రిటీషువాళ్ళు పన్నుల వసూళ్ళకు అనుకూలంగా, తమకు సాయంచేసిన బలవంతులైన రాజులను, నవాబులను సంస్థానాధీశులుగా నియమించారు. ఇటువంటివి 566 సంస్థానాలున్నాయి. బ్రిటీషువాళ్ళు మన దేశాన్ని విడిచి వెళ్తూ కొన్ని అపోహలనూ, అనవసరమయిన అపభ్రమలనూ కల్పించారు. పటేలు అవన్నీ రూపుమాపి భారతదేశంలో ఆ సంస్థానాలు మిళితమయ్యేటట్లు చేశారు. హైదరాబాదు సంస్థానం భారతదేశంలో కలవడానికి నిజాం అంగీకరించలేదు. శాంతిభద్రతలు సన్నగిల్లాయి. కాశీం రజ్వీ ప్రభృతుల చెప్పుడు మాటలు విని నిజాం ప్రభువు తన మంకు పట్టువదల లేదు. భారతదేశానికి గుండెకాయ వంటి చోట ఇలాంటి పరిస్థితి పటేలుకు సహించరానిదయింది. ఈ పరిస్థితిని దండనీతితోనే అణచాలని తలచాడు. 1948 సెప్టెంబరు 13వ తేదీన భారతసైన్యం నలుమూలల నుంచి ఒక్కసారిగా వచ్చి హైదరాబాదు సంస్థానంలోకి ప్రవేశించింది. దీన్నే పోలీసుచర్య అంటారు. హైదరాబదు రాజ్యం భారత ప్రభుత్వ అధీనతలోకి వచ్చింది.

నిజాం తన అధికారాన్ని వదులుకోక తప్పలేదు. తన సంస్థానాన్ని అఖండభారతంలో కలపడానికి అంగీకరించాడు. అల్లర్లు సద్దుమణిగాయి శాంతిభద్రతలు నెలకొన్నాయి. ఇంత సులభంగా ఈ కార్యం సాధించడం సర్దార్ పటేలు ప్రజ్ఞా విశేషంవల్లనే.

శక్తినంతా మాతృదేశసేవకు ధారపోసిన పటేలు, గుండె జబ్బు రావడంవల్ల 1950 సం॥ డిసెంబరు 15వ తేదీన మనలను దుఃఖసాగరంలో ముంచి స్వర్గస్థులయ్యారు. చైనాదాడి, పాకిస్థాన్ విజృంభణల సందర్భంలో పటేలు జీవించి ఉంటే ఎంత బాగుండి ఉండేది అని భారతదేశంలో ఆబాలగోపాలం అనుకొన్నారు. దీన్ని బట్టి ఆయన ధైర్యసాహసాలను మనం అర్థం చేసుకోవచ్చు. తన సర్వస్వాన్ని దేశమాతసేవకు అంకితం చేసిన పటేలు ధన్యుడు, మనకు ఆదర్శ పురుషుడు.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. 'ఎవరతను?' అని పాఠం శీర్షిక చూడగానే మీకేమనిపించింది? ఈ పాఠం ఎవరి గురించి మీరూహించారు?
2. పటేలు సాహసాలు వింటే మీకేమనిపించింది?
4. పటేలు ధైర్యం ప్రదర్శించిన సన్నివేశాల్ని మీ సొంతమాటల్లో చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. ఈ కింది వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించండి. కింద గీత గీయండి.

అ) వైద్య సదుపాయాలు ఉండేవి కావు.
ఆ) విషాదాన్ని బయటపెట్టాడు.
ఇ) అసమాన్య దక్షత చూపించాడు.
ఈ) ఆబాలగోపాలం అనుకున్నారు.
ఉ) భారతదేశానికి గుండెకాయ.



© SCERT not to be republished

2. కింది వాక్యానికి సమానార్థానిచ్చే సరైన వాక్యాన్ని గుర్తించండి.

**1) పటేలు ధైర్యసాహసాలు గల వ్యక్తి.** (       )

అ) పటేలు ధైర్యం ప్రదర్శిస్తాడు.

ఆ) పటేలు ఎదిరించి ధైర్యసాహసాలు ప్రదర్శిస్తాడు.

ఇ) పటేలుకు స్వతహాగా ధైర్యసాహసాలు ఉన్నాయి.

ఈ) పటేలుకు ధైర్యసాహసాలు ఎక్కువ.

3. కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అ) పటేలు చిన్ననాటి కలలు ఏవి?

ఆ) పటేలు గుండెల్లో దాచుకున్న ఏ విషయం బయటపెట్టాడు?

ఇ) పటేలు ఎవరికి నివాసాలు కల్పించాడు? ఎందుకు?

ఈ) నిజాం ప్రభువుకు చెడుమాటలు చెప్పిందెవరు? దాని ఫలితమేమిటి?

ఉ) పటేలుకు సర్దార్ బిరుదు ఎందుకు వచ్చింది?

## III. స్వీయరచన



1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) ధైర్యసాహసాలు ఉండడంవల్ల లాభమేమిటి?

ఆ) దేశంలో శాంతిభద్రతలు నెలకొల్పడానికి పటేలు ఏం చేశాడు?

ఇ) పటేలును ప్రజలు ఎలా గౌరవించారు?

2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) పటేలు గురించి సొంతమాటల్లో రాయండి.

ఆ) బార్డోలి సత్యాగ్రహానికి పటేలు ఏవిధంగా పిలుపునిచ్చాడు?

ఇ) పటేలు ఆంగ్లేయులను ఏవిధంగా ముప్పుతిప్పలు పెట్టాడు?

## IV. పదజాలం



1. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అదే అర్థం వచ్చే పదాలను బ్రాకెట్లలో రాయండి.

అ) వందేమాతరం అంటే తనువు పులకిస్తుంది. (       )

i) శరీరం   ii) తల   iii) చెట్టు   v) ఆకాశం



ఆ) పటేలు ప్రజ్ఞకు అందరూ ఆశ్చర్యపోయేవారు. (       )


i) అజ్ఞానం   ii) తెలివి   iii) ధైర్యం   v) సాహసం

ఇ) భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. (       )

i) ఆకాంక్ష   ii) స్వేచ్ఛ   iii) కానుక   v) బంధం

ఈ) ఈ దేశాన్ని ఎంతో మంది ప్రభువులు పాలించారు. (       )

i) దేవుడు   ii) రాజు   iii) మంత్రి   v) రాక్షసుడు



2. కింద గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. ఈ పదాలతో సొంతవాక్యాలు రాయండి.

అ) రాబిన్ ఇప్పుడే తేరుకున్నాడు.

______________________

ఆ) కలలుకనడంతో కాలం గడవడంవల్ల ప్రయోజనంలేదు.

______________________

ఇ) రమాదేవి ఎప్పుడూ దానధర్మాలు చేస్తుంది.

______________________

ఈ) కోడి రామమూర్తి ఉక్కుమనిషి.

______________________

ఉ) భారతదేశం శాంతిభద్రత లకు నిలయం.

______________________

## V. సృజనాత్మకత



కింది వానిలో ఏదైనా ఒకదాన్ని రాయండి.

అ) సర్దార్ పటేలు ధైర్యసాహసాలను గురించి మిత్రునికి లేఖ రాయండి.

ఆ) ఈ పాఠ్యభాగం ఆధారంగా పటేలు గురించి 'ఏకపాత్రాభినయం' కోసం వాక్యాలు రాయండి. ఏకపాత్రాభినయం చేయండి.

## VI. ప్రశంస



కింది వానిలో ఏదైనా ఒకదాన్ని రాయండి.

అ) పటేలుకు సర్దార్ బిరుదు వచ్చిందిగదా! ఆయన్ని ప్రశంసిస్తూ అభినందన పత్రం రాయండి.

ఆ) పటేలు ధైర్యసాహసాలను తెలుసుకున్నారు గదా! దీని ద్వారా మీరు పొందిన స్ఫూర్తి గురించి ఒక లేఖద్వారా మిత్రునికి తెలియజేయండి.



## VII. భాషాంశాలు



1. కింది వాక్యాలను, భావాన్ని బట్టి అవి ఏ వాక్యాలో గుర్తించండి. ఆ పక్కన రాయండి.

ఉదా: ఎంత బాగుందో! – ఆశ్చర్యార్థకం

అ) నువ్వు చదువు. ______________________

ఆ) అల్లరి చేయవద్దు! ______________________

ఇ) పరీక్షలు రాయవచ్చు. ______________________

ఈ) తనూ బొమ్మలు వేయగలదు. ______________________

ఇప్పుడు మరిన్ని వాక్యభేదాలు చూద్దాం.

1. రవి పనిచేస్తాడో, చెయ్యడో!

ఈ వాక్యం చదివితే రవి పని చేయటం అనే విషయంలో అనుమానం అంటే సందేహం కలుగుతున్నది కదూ! ఇలా సందేహాన్ని తెలిపే వాక్యాలను **సందేహార్థక వాక్యాలు** అంటారు.



2. నువ్వు నూరేళ్ళు వర్ధిల్లు!

ఈ వాక్యం ఏ అర్థాన్ని సూచిస్తున్నది? ఒక వ్యక్తిని ఆశీర్వదిస్తున్నట్లు కనబడుతోంది కదూ! ఇలా ఆశీర్వదిస్తున్నట్లు అర్థాన్ని సూచించే వాక్యాలను **ఆశీర్వాద్యర్థక వాక్యాలు** అంటాం.

3. దయచేసి పని చేయండి.

ఈ వాక్యం ఒక పనిని చేయమని ప్రార్థిస్తూ ఉంది. అంటే ప్రార్థన అర్థాన్ని సూచిస్తున్నది. కాబట్టి ఇది **ప్రార్థనార్థక వాక్యం.**

ఒక వాక్యం ప్రార్థన అర్థాన్ని సూచిస్తున్నట్లు ఉంటే అది ప్రార్థనార్థక వాక్యం అన్నమాట.

4. ఏం! ఎప్పుడొచ్చావ్?

ఈ వాక్యం ప్రశ్నిస్తున్నట్లుంది కదూ! అంటే ఇది ప్రశ్నార్థక వాక్యం.

ఒక వాక్యానికి ప్రశ్నను సూచించే అర్థం ఉంటే దాన్ని **ప్రశ్నార్థక వాక్యం** అంటాం.

5. వర్షాలు లేక పంటలు పండలేదు.

ఈ వాక్యం మనకు రెండు విషయాల్ని తెలుపుతోంది. ఒకటి వర్షాలు లేవని, రెండు పంటలు పండలేదని. ఐతే పంటలు పండకపోవటానికి కారణం మొదటి విషయం. అంటే వర్షాలు లేకపోవటం. ఈ మొదటి విషయం రెండో విషయానికి



కారణమౌతూంది. అంటే హేతువు అన్నమాట. ఇలా హేతువు అర్థాన్ని సూచించే వాక్యం **హేత్వర్థక వాక్యం.**

ఒక పని కావడానికి కారణాన్ని లేదా హేతువును సూచించే అర్థం ఉన్న వాక్యాన్ని హేత్వర్థక వాక్యం అంటాం.



2. కింది వాక్యాలు ఏ అర్థాన్ని సూచించే వాక్యాలలో రాయండి.

అ) ఎవరా పైడిబొమ్మ? ______________________

ఆ) పంటలు పండలేదు. ______________________

ఇ) దయచేసి సెలవు ఇవ్వండి. ______________________

ఈ) కిషన్ చదువుతాడో లేదో! ______________________

ఉ) మీకు శుభం కలగాలి! ______________________

ఇలాంటి వాక్యాల్ని మీ పాఠ్యాంశాలలో వెతికి రాయండి.

### ప్రాజెక్టు పని

**స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న దేశనాయకుల చిత్రాలను సేకరించండి. వారి గురించి రాసి ప్రదర్శించండి.**



### నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | సర్దార్ పటేల్ గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | కీలక వాక్యాలను, సమానార్థక వాక్యాలను పాఠంలో గుర్తించగలను. | ఔను / కాదు |
| 3. | సర్దార్ పటేల్ గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | పటేల్ గొప్పదనం గురించి లేఖ, ఏకపాత్రకు సంభాషణలు రాయగలను. | ఔను / కాదు |

*"సంకల్ప బలం, గొప్ప ఆత్మవిశ్వాసం మనిషిని ముందుకు వెళ్ళేలా చేస్తాయి'*




©SCERT not to be republished

యూనిట్ III

# 9. చిన్నవస్తువులు

- నాళం కృష్ణారావు

**ఆలోచించండి-మాట్లాడండి**



**ప్రశ్నలు:**

1. పై చిత్రంలో ఏమేమి ఉన్నాయి?
2. అవి ఏం చేస్తున్నాయి?
3. అవి ప్రకృతికి ఎలా శోభనిస్తున్నాయి?
4. వాటిలో నీకు ఏది బాగా నచ్చింది? ఎందుకు?

**ఉద్దేశం:** ప్రకృతిలోని ఏ వస్తువునూ చిన్న చూపు చూడరాదని, ప్రకృతిని ఆస్వాదిస్తూ, ఆనందించాలనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేయమే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

© SCERT not to be republished